నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, ఆదివారం 1 జూన్ 2025 HYDERABAD




## వర్షసూచన

సిటీబ్యూరో, మే 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా రుతుపవనాలు విస్తరించడంతో రాగల రెండు రోజులు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ, మరికొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. దీనిని దృష్టిలోపెట్టుకుని నగరానికి ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేశారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 35.2, కనిష్ఠం 24.6 డిగ్రీలు, గాలిలో తేమ 41 శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీసుల రిహార్సల్స్

## విశ్వ సుందరి



హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శనివారం ఉత్కంఠగా సాగిన 72వ మిస్ వరల్డ్ పోటీల్లో థాయిలాండ్ సుందరి ఓపల్ సుచాత చువాంగ్‌శ్రీ ప్రపంచ సుందరి కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. దీంతో థాయిలాండ్ అభిమానులు సంబురాలు చేసుకున్నారు. ఈ మిస్‌వరల్డ్ పోటీల్లో మొత్తం 108 దేశాలకు చెందిన కంటెస్టెంట్‌లు పాల్గొన్నారు.



శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# ఇందిరమ్మ ఇండ్లపై అయోమయం

- రాజీవ్ యువ వికాసం యూనిట్ల ఎంపికలో బీసీలకు అన్యాయం
- బస్తీ దవాఖానలు నిర్వీర్యం
- నగరాభివృద్ధి సమీక్షలో సమస్యల్ని ఎత్తిచూపిన దాసోజు, కాలేరు
- డబుల్ బెడ్రూం ఎందుకు పంపిణీ చేయడంలేదో చెప్పాలని డిమాండ్

**సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 31 (నమస్తే తెలంగాణ):**

నగరంలో వీధిలైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారి అంధకారం రాజ్యమేలుతోందని.. మరోవైపు కనీసం ఫాగింగ్ చేసే దిక్కులేక దోమలు స్వైర విహారం చేస్తుండటంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు దాసోజు శ్రవణ్, కాలేరు వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన హైదరాబాద్ జిల్లా సమీక్షా సమావేశంలో జరిగింది. ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, నగర ఎమ్మెల్యేలు పలువురు పాల్గొన్నారు. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కూడా సమావేశానికి హాజరై నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యల్ని ఏకరువు పెట్టారు. ప్రభుత్వ, అధికార యంత్రాంగం సరైన రీతిలో స్పందించికపోవడంతో జనం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నగరంలో లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లు లక్ష్యంగా చేపట్టిన అద్భుత కార్యక్రమంలో భాగంగా వేలాది ఇండ్లను పంపిణీ చేశామని, కానీ ఈ ప్రభుత్వం సిద్ధమైన ఇండ్లను నిరుపేదలకు పంపిణీ చేయడంలేదన్నారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం మార్గదర్శకాల్లో ఇప్పటికీ అస్పష్టత కొనసాగుతుందని, నగరంలో జాగాలు ఉన్న నిరుపేదలు అతి తక్కువ మంది ఉండటంతో పాటు చాలా మందికి కొంత స్థలం ఉన్నా వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు ఉండటంలేదన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా హైదరాబాద్ జిల్లాలో ఎంపిక జాబితాను పరిశీలిస్తే బీసీ యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. బస్తీ దవాఖాలన్నీ నిర్వీర్యమైపోవడం ఆవేదన కలిగిస్తున్నదన్నారు.

### హైడ్రా పేరుతో భయభ్రాంతులు

నగరంలో హైడ్రా పేరుతో ప్రభుత్వం ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి దశ దిశ లేదని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ముఖ్యమైన మున్సిపల్ శాఖను ముఖ్యమంత్రి తన వద్ద పెట్టుకుని అభివృద్ధి కుంటుపడేలా చేస్తున్నారని ఆరోపించారు.

### 15 లోపు అర్హులకు డబుల్ బెడ్రూం ఇండ్లు

**మంత్రి పొన్నం**

గత ప్రభుత్వం నిర్మించిన 62,500 పైగా ఉన్న రెండు పడకల గదుల ఇండ్లను ప్రభుత్వంతో చర్చించి జూన్ 15 వరకు పేదలకు పంపిణీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. స్థలాలు ఉన్న పేదలకు అత్యంత ప్రాధాన్యతతో రెండు పడకల గదుల ఇళ్లను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. వర్షాకాలం నేపథ్యంలో 150 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించేలా పటిష్ట చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లేవనెత్తిన అనేక అంశాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, హెచ్‌ఎండీఏ కమిషనర్ అశోక్ రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

### పురపాలక శాఖ మంత్రి లేకుండా సమీక్షనా?

హైదరాబాద్ నగరాభివృద్ధి సమీక్ష సంబంధిత పురపాలక శాఖ మంత్రి లేకుండానే నిర్వహించడమంటే ప్రభుత్వానికి నగరాభివృద్ధిపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమనే విమర్శలు వినిపిస్తున్నాయి. అందునా హడావుడిగా ఉదయం ఎజెండా అంశాలు పంపించి.. సాయంత్రానికి సమీక్ష ముగించడంపై పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో జరిగే ఈ సమీక్షపై కొన్నిరోజుల ముందే సమాచారం ఉంటే ప్రజాప్రతినిధులుగానీ, అధికార యంత్రాంగంగానీ సమస్యలపై లోతైన పరిశీలన చేసి పరిష్కారాలను సైతం ప్రభుత్వం ముందు ఉంచే అవకాశముంటుందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. సీఎం దగ్గరే పురపాలక శాఖ ఉన్నందున ఆయన ఆధ్వర్యంలో ఇలాంటి సమీక్షల్ని నిర్వహిస్తే నిధుల కేటాయింపు, ఇతర క్లిష్టమైన సమస్యల పరిష్కారం జరుగుతుందన్నారు.



# జనంలో నీతులు.. తెర వెనుక బూతులు

## దళితులు, మైనార్టీలను దోచుకోవడమే.. ఇదీ ఫసియుద్దీన్ నిజరూపం

సిటీబ్యూరో, మే 31: జనంలో ఉన్నప్పుడు ఏకధాటిగా నీతులు వల్లించటం.. తెర వెనుక బూతుల పురాణం.. ఇదీ బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అసలు రూపం. డివిజన్ లోని మైనార్టీలు, దళిత సామాజిక జనంలో ఉన్నప్పుడు ఎంతో ఆప్యాయతను ప్రదర్శించడం, అక్కడి నుంచి వెళ్లిన తర్వాత చిన్న చిన్న కారణాలను అదనుగా తీసుకుని అదే జనంపై ఆగ్రహం.. తీవ్ర పదజాలంతో దూషించటం ఫసియుద్దీన్‌కు వెన్నతో పెట్టిన విద్య. బోరబండ డివిజన్‌లో ఉంటున్న దళితులు, మైనార్టీలు తమకున్న కొద్ది స్థలంలో ఇంటి నిర్మాణాలు మొదలు పెడితే చాలు.. ఫసియుద్దీన్ మనుషులు అక్కడ వాలిపోవటం జరుగుతూ వస్తుంది. సదరు వ్యక్తులు పేదలను బెదిరించి వసూళ్లకు బరి తెగించటం సాధారణ విషయం.

### ఫసియుద్దీన్‌కు కఠిన శిక్ష పడాలి..



బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడు సర్దార్ బలవన్మరణానికి కారకుడైన ఫసియుద్దీన్, ఈయన భార్య హబీబా సుల్తానా, పీఏ సప్తగిరికి కఠిన శిక్ష పడాల్సిందేనని మైనార్టీలు సహా డివిజన్ ప్రజలు ఎంతో ఎదురు చూస్తున్నారు. ఇన్ని రోజులుగా ఫసియుద్దీన్ మాటలు, వేధింపులకు భయపడ్డ స్థానికులు తాజా సంఘటనతో ఆయనపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

### గ్రేటర్‌లో కలెక్షన్ కింగ్..

అక్రమ వసూళ్ల తో ఆరితేరిన ఫసియుద్దీన్ గ్రేటర్ లోనే కలెక్షన్ కింగ్‌గా పేరు తెచ్చుకున్నాడు అనటంలో అతిశయోక్తి లేదు. ఒకప్పుడు రూ.100-200 కోసం తనకు తెలిసిన వాళ్ల ఇండ్ల వద్ద అర్ధరాత్రి వరకు పడిగాపులు కాచిన ఫసియుద్దీన్ అక్రమ వసూళ్లలో కోట్లకు పడగెత్తిన విషయం చర్చనీయాంశంగా మారింది. డివిజన్‌లో ఎంతో మంది ఉసురు పోసుకున్న ఫసియుద్దీన్, హబీబా సుల్తానా, సప్తగిరి.. ఈ ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డివిజన్ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# వారం రోజులుగా నరకయాతన

## మలక్‌పేట ప్రధాన రహదారిపై పగిలిన డ్రైనేజీ పైప్‌లైన్

- రహదారిని ముంచెత్తిన మురుగునీరు
- వాహనదారుల అవస్థలు
- గంటల తరబడి ట్రాఫిక్ జామ్..
- జఠిలంగా మారిన సమస్య..
- మురుగునీటి ప్రాంతాన్ని సందర్శించిన అధికారులు
- పైప్‌లైన్ నిర్మాణ పనులు షురూ
- ఆ మార్గంలో ట్రాఫిక్ నియంత్రణ

సైదాబాద్ మే 31 : మలక్‌పేట ప్రధాన రహదారిపై పైప్‌లైన్ పగిలిపోయింది. ఫలితంగా రహదారిపైకి మురుగునీరు ముంచెత్తడంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. వరద కాలువ నీటి కాలువ, డ్రైనేజీ కాలువ వేర్వేరుగా లేకపోవడంతో ఒకే దాంట్లో మురుగునీరు, వర్షపు నీరు ప్రవహించడంతో డ్రైనేజీ పైప్‌లైన్ పగిలిపోయింది. ఫలితంగా మురుగునీరు రోడ్లను ముంచెత్తింది. గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌కు కారణమైంది. సమస్య జటిలంగా మారడంతో అధికారులు పైప్‌లైన్ నిర్మాణ పనులను చేపట్టారు.

### ప్రధాన రహదారిపై పరేషాన్

డ్రైనేజీ పైప్ పగిలిపోవడంతో మురుగు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర సౌకర్యంగా మారింది. కాగా, చంచల్‌గూడ జైలు వద్ద నుంచి వచ్చే వరద నీటి కాలువ పిల్లర్ నంబర్ 14, 18 వద్ద డ్రైనేజీ లైన్ లో కలవడంతోని ముంపు సమస్య ఏర్పడింది. ఒకే లైన్లో వరదనీటి కాలువ, మురుగు కాలువ కలిసి ఉండడంతోనే తరచూ మురుగునీరు పొంగిపొర్లుతున్నది. ప్రస్తుతం ఉన్న సామర్థ్యం కంటే మురుగునీరు వరద నీరు ప్రవహిస్తుండటంతో డ్రైనేజీ లైన్లో లీకేజీలు అవుతున్నాయి. సమస్య నివారించడానికి జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు రెండు వేర్వేరు పైప్‌లైన్ల పనులను చేపట్టాలని నిర్ణయించి, వాటి పనుల ప్రక్రియను ప్రారంభించారు. కాగా, నల్గొండ చౌరస్తా మార్గంలో డ్రైనేజీ మురుగునీరు వారం రోజులుగా పొంగిపొర్లుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరంతా మలక్‌పేట అండర్ రైల్వే బ్రిడ్జి వరకు వెళ్లడంతో వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. మలక్‌పేట రైల్వే బ్రిడ్జి వద్ద మురుగునీరు నిలిచి పోవడంతో గంటల తరబడి వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇదిలా ఉంటే మలక్‌పేట- నల్గొండ క్రాస్ రోడ్డులో మురుగునీరు ప్రవహిస్తున్న ప్రాంతాన్ని జీహెచ్‌ఎం కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవీస్, జలమండలి సీజీఎం నాగేంద్ర కుమార్, మలక్ పేట జీహెచ్‌ఎంసీ డీసీ జయంత్, ఉన్నతాధికారులు సందర్శించారు. మురుగునీటి ఆధునీకరణ పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు.



నల్గొండ క్రాస్‌రోడ్డులో పనులను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు



### ట్రాఫిక్ దారి మళ్లింపు

చాదర్‌ఘాట్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు వచ్చే ప్రయాణికులు పనులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాలని ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. సూచించారు.

# అంతా గోప్యం

## పారదర్శకతకు పంగనామం

సిటీబ్యూరో, మే 31(నమస్తే తెలంగాణ) : పారదర్శకతకు పంగనామం పెడుతూ.. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నిర్మాణ విధానాన్ని అంత గోప్యంగా మార్చేశారు. అందుబాటులో ఉన్న టీజీబీపాస్ కంటే మరింత సులభతరమైన విధానం బిల్డ్ నౌ అని చెప్పుకుంటూ ప్రభుత్వం చేస్తున్న జాప్యం హెచ్‌ఎండీఏలో దరఖాస్తుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దరఖాస్తు చేసుకున్న వెంటనే అనుమతులు ఇస్తున్నామని చెబుతున్నా.. షార్ట్ ఫాల్స్ కారణంగా ఎదురయ్యే సమస్యల పురోగతి తెలుసుకునే వీల్లేకుండా పోతున్నది. దీంతో దరఖాస్తుదారులు కార్యాలయానికి అనివార్యంగా రావాల్సి వస్తున్నదని వాపోతున్నారు. గతంలో అమలులో ఉన్న డీపీఎంఎస్, టీజీబీపాస్‌లో దరఖాస్తు చేసిన వాటి పురోగతి తెలుసుకునే అవకాశం లేకుండా ఆ రెండు సైట్లు కూడా మొరాయించడంతో భవన నిర్మాణ అనుమతుల కోసం హెచ్‌ఎండీఏ కార్యాలయానికి అటు అర్కిటెక్చర్లు, ఇటు నిర్మాణదారులు చక్కర్లు కొడుతున్నారు.

### పూర్తి స్థాయిలో అమలు కాని బిల్డ్ నౌ

భవన నిర్మాణ అనుమతులను ఏఐ విధానంతో మరింత సరళీకరిస్తూ తీసుకువచ్చిన బిల్డ్ నౌ ఇంకా పూర్తి స్థాయిలో హెచ్‌ఎండీఏలో అమలులోకి రాకపోవడంతో దరఖాస్తుదారులకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో డీపీఎంఎస్, టీజీబీపాస్ ద్వారా దరఖాస్తు చేసి, నిర్మాణ అనుమతుల కోసం ఎదురుచూస్తున్న వారికి... ఇప్పుడు ఆ ఫైల్ ఏ దశలో ఉందనే విషయాన్ని తెలుసుకోవడానికి కార్యాలయానికి రావాల్సి వస్తోంది. పాత విధానంలోని టీజీబీపాస్ కానీ, డీపీఎంఎస్ ద్వారా వచ్చిన దరఖాస్తులు, వాటి పురోగతి, షార్ట్ ఫాల్స్ వంటి రిమార్కులతో సహా తెలుసుకునే విధంగా ఆ సైట్లలో సదుపాయం ఉండేది. కానీ బిల్డ్ నౌ వస్తుందనే సాకుతో... ఆ రెండు సైట్ల నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో హెచ్‌ఎండీఏ పరిధిలో దరఖాస్తుదారులకు కొత్త సమస్యలను ఎదుర్కొంటున్నారు.

### మొరాయిస్తున్న వెబ్‌సైట్

కొత్తగా అమలులోకి వచ్చిన బిల్డ్ నౌ వెబ్‌సైట్ కూడా సాంకేతిక సమస్యలతో మొరాయిస్తున్నది. సిటిజన్ సెర్చ్ వినియోగించాలంటే ఓటీపీ సమస్యలతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు.పాత దరఖాస్తుల సమాచారాన్ని తెలుసుకోవాలనుకుంటే హెచ్‌ఎండీఏ డీపీఎంఎస్, టీజీబీపాస్ సైట్లు తెరుచుకోవడమే గగనమైంది. ఇక ఎంతో కీలకమైన చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్, ల్యాండ్ యూజ్, బిల్డింగ్ అప్రూవల్స్ తెలుసుకునే అవకాశం లేకుండా పోవడంతో.. తెర వెనుక ఏం జరుగుతుందోననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.






# మెడికల్ అధికారులేరీ?

- యూపీహెచ్‌సీల్లో సగానికి పైగా పోస్టులు ఖాళీ
- ఖాళీలు ఏర్పడి ఎనిమిది నెలలు గడుస్తున్నా భర్తీ చేయని రాష్ట్ర సర్కార్
- పేదలకు తప్పని అవస్థలు

**సిటీబ్యూరో, మే 31,(నమస్తే తెలంగాణ):**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఆరోగ్యకేంద్రాలు అనారోగ్యానికి గురయ్యాయి. సిబ్బంది కొరత కారణంగా నాణ్యమైన వైద్యసేవలు అందించడంలో వెనుకడుగు వేస్తున్నాయి. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(యూపీహెచ్‌సీ) అత్యంత కీలకమైన మెడికల్ అధికారి పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. నాడి పట్టే వైద్యులు లేక పేదలకు నానా అవస్థలు తప్పడం లేదు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నవారే అదనపు సెంటర్లలో వైద్యసేవలందిస్తున్నారు. మరికొన్ని కేంద్రాల్లో ఏఎన్‌ఎంలే చికిత్సనందిస్తుండటం గమనార్హం.

### భర్తీకి సిద్ధంగా 40 ఖాళీలు..

పేదవాడికి జబ్బుచేస్తే వెంటనే గుర్తుకొచ్చేది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే. కేసీఆర్ పాలనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు బస్తీ దవాఖానలు సైతం ఏర్పాటు చేసి పేదవాడి ఇంటి ముందే ఉచిత వైద్యం చేరవేశారు. జిల్లాలోని బస్తీవాసులు, పేద ప్రజలు, మధ్యతరగతి ప్రజలకు బస్తీ దవాఖానలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు నిరంతరం నాణ్యమైన వైద్యసేవలందించాయి. కానీ నేడు అవన్నీ సిబ్బంది కొరతతో స్వాగతం పలుకుతున్నాయి.

మిగతా IVవ పేజీలో